# చివరికి మిగిలిన రంగడు

అవి హరిజనోద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులు. శివయ్య శాస్త్రి హరిజనసేవా సంఘానికి సెక్రటరీగా వుండేవాడు. వాళ్ల యిల్లు కాకినాడ గాంధీనగరంలో, రైలుకట్ట పక్కని పార్కుకి ఎడమచేతివైపు మలుపులో వుంది. శాస్త్రి ఐశ్వర్యవంతుడు కానీ సంతానం లేదు. అన్న కొడుకు రంగణ్ణి తెచ్చి పెంచుకుంటున్నాడు.

శాస్త్రి అన్నగారు భైరవమూర్తి అసాధ్యుడు. ఆయనా కలవాడే. గుళ్లవీధిలోవుంది ఆయన మేడ. భైరవమూర్తి ఆహితాగ్ని, ఘనాంతస్వాధ్యాయి; వేదం పధ్నాలుగు పన్నాలూ గళగ్రాహి గావొచ్చు; నెత్తిన గోష్పాద మంతజుట్టూ, మెళ్లో రుద్రాక్షలూ, బిళ్లగోచీ, స్వతహా కోపిష్ఠీ; చరచరా నడుస్తుంటే దూర్వాసమహర్షి చక్కావొచ్చాడా అనిపిస్తుంది.

తమ్ముడు మాలా[illegible]ండిగల్ని వెనకాలేసుకుని అంటూ సొంటూ లేకుండా తిరుగుతున్నాడని కర్ణాకర్ణిగా విన్నాడు భైరవమూర్తి; విని అగ్గిమీద గుగ్గిలమయిపోయాడు; అదే తన ఇంట్లో అయితే నిలువునా చీరేశేవాడు. కాని తమ్ముడు స్వతంత్రుడు.

ఆవేళ గుళ్లవీధిలో, జగన్నాధస్వామి కోవెలలో హరిజన ప్రవేశం జరుగుతుందని ఊరంతా గుప్పుమంది. శాస్త్రి పెందలాడే లేచి హరిజన హాస్టలికి బయలుదేరుతుంటే భైరవమూర్తి వొచ్చాడు.

"హు – కలికాలం బిళ్లపెట్టుగా వొచ్చిపడుతోంది" అంటూ అందుకున్నాడాయన. శాస్త్రి మౌనంగా ఊరుకున్నాడు.

"ఏమిట్రా అబ్బాయీ! ఇటు చూడు. మన వంశమేమిటో, మన సంప్రదాయమేమిటో, మన శిష్టాచార సంపత్తి ఏమిటో వీసమైనా–"

"అన్నీ తెలుసునాకు" శాస్త్రి చిన్నగా నవ్వాడు. ఆ నవ్వులో చిలిపితనం ఊహించుకున్నాడు మూర్తి.

"తెలుసునూ." అయితే, ఆ వేషా లేమిట్రా? ఆ గోనెగుడ్డలు కట్టుకుని, జండాలు పుచ్చుకుని

వీధులమ్మటా ఆ గంగ వెర్రులేమిటి? వాళ్ల సరసని కూచుని భోజనాలేమిటి? హరి హరీ అగ్నిహోత్రంలాంటి కుటుంబంలో-"

చెవులు మూసుకుని చట్టున జ్ఞాపకాని కొచ్చింది గావును,

"అన్నట్టు నిజమేనట్రా? మీరంతా ఇవ్వాళ పంచములందరికీ తలంట్లుపోసి గుళ్లల్లోకి జొరబడమని ఉషారిస్తున్నారటగా."

"నేను తరువాత అంతా చెబుతాగా మీతో - వేదపాఠశాలకి టైమయిందేమో మీకు" గడియారంవంక యదాలాపంగా చూసాడు శాస్త్రి.

ఏమిటీ? ఉగ్రుడైపోతున్నాడు భైరవమూర్తి.

"తరువాత చెబుతావా? నువ్వా నాకు ఛెప్పేది? ఒచ్చి ఉపదేశం చేస్తావట్రా?

శాస్త్రి నమస్కార బాణంలాంటి నవ్వు నవ్వాడు.

"ఉపదేశానిక్కాదండీ మీరు పెద్దలు. ఒక్క ముక్కలో వివరించగలనా చెప్పండి?"

భైరవమూర్తి గుక్క తిప్పుకున్నాడు.

"ఒరేయ్ ఉప్పు తయారుచెయ్యి, మిల్లుబట్టలు తగలెయ్యి. తెల్లవాడి శాసనాన్ని ఉల్లంఘించు. చాతనయితే తెల్లవాడిని పేల్చిపారేసి జైలులోపడు. అదీ చేవగలపని. అంతేగాని ఇదేమిట్రా ఎంగిలి మంగలం?... నాకు తెలుసులేరా ఈ ఎత్తులు - మాలపల్లిలో రోడ్లు వేస్తున్నట్టు నటించడం, కూలికి చెడి, పొట్టబోసుకునే బ్రతుకు దెరువు వొదులుకుని, పచ్చ జండాలు పుచ్చుకుని, బళ్లలోనూ, గుళ్లలోనూ వాళ్లు మగ్గుతుంటే, వాళ్లనేదో ఉద్ధరిస్తున్నట్టు మీరంతా రొమ్ములు విరుచుకోడమూ ఏమి సౌదభ్యంగానైనా వుందికదూ? ఒరేయ్; సవాలు చేస్తాను. వాళ్లకి కొంపలు లేవు. నీ మేడ ఖాళీచెయ్యి; చదువుకుంటారు, డబ్బివ్వు. పొలాలులేవు వాళ్లకి నీ పొలం పంచు... అట్లా చూస్తావేమిట్రా?"

శాస్త్రి పకాలుమని నవ్వాడు. అన్నగారు స్వరాజ్యోద్యమంలో ఇంతటి మీమాంసా, విచక్షణా స్ఫూర్తీ ఒలకబోస్తా యిదే మొదటిసారి.

"అయితే అన్నాయి - జైళ్లకి వెళ్లినా అంటావు. 'స్వరాజ్య మెట్లాగో వస్తుంది. నేను జైలుకిన్నిసార్లు వెళ్లి దేశాన్ని ఉద్ధరించాను అని ఏ మంత్రిత్వాలేనా వెలగబట్టవచ్చును గదా! అని ఈ దూకుడంతా నాకు తెలియదూ, - అంటావు తప్పకుండా. కాని అన్నాయ్ నా దౌర్బల్యాన్ని నీవు పసికట్టినమాట మాత్రం నిజం. ఉద్యమంలో చేయి కాల్చుకోకుండా దూర దూరంగా ఉండాలనీ, జైల్లో పడకుండా ఈ శరీరాన్ని భద్రంగా కాపాడుకోవాలనీ కక్కుర్తిలేదు గాని - ఒకానొక బంగారు సంకెల నన్ను ఈ హరిజన సేవాకార్యక్రమానికి అంటిపెట్టి వుంచిందని నువ్వు గ్రహించే వున్నావు - రంగణ్ణి విడిచి నేను ఉండలేను."

"నాయనా, నీ పట్టు నాకు తెలుసు. నీది అగ్నిలాంటి మనస్తత్వం. నాకు నువ్వంటే

గర్వంలేకపోలేదు. నాదిమాత్రం నలుగురూ నడవగా నలుగుడుపడ్డ దోవ. గౌతమబుద్ధుడులాంటి అర్ద్రహృదయం నీది... ఈ జాలి గుణం ఆర్తులైనవారిపట్ల ఇలా అతిగా కరిగిపోయే అరిపేదగుణం ధర్మచ్యుతికి దారితీస్తుందిరా! నాయనా! ధర్మచ్యుతికి దారితీస్తుంది."

"అన్నాయ్! శాస్త్రాలెత్తిచూపీ, లౌక్యాలు ప్రయోగించీ నన్ను మార్చాలన్న ప్రయత్నం వృథా అని ఈపాటికి నీకు గ్రాహ్యమయ్యే వుంటుంది. మరి వస్తా!"

భైరవమూర్తి కనుగొలుకుల్లోంచి చూసాడు తమ్ముడివంక.

రంగడికి ఇప్పుడిప్పుడే వొచ్చీరాని మాటలొస్తున్నాయి. శాస్త్రికి హాస్టలులోవున్నా పంచప్రాణాలూ వాడిమీదనే వుంటాయి. "అసిరిగాడు ఒక్కపూటే తింటాడట నాన్నా నాకు మూడు పూటలెందుకూ? కాలవ గండిపడి, నాగులు వాళ్ల గుడిశ కొట్టుకుపోయిందట నాన్నా - మన మేడమీద గదులు ఖాళీగా వున్నాయికదూ!" అని యక్షప్రశ్నలు వేస్తున్నాడు. కొంచెం కాలూ చెయ్యీ వొచ్చాయేమో పొరిగిళ్లూ దొడ్లూ పాకలూ అన్నీ వాడివే.

శివయ్యశాస్త్రి గదిలో రాసుకుంటూ వుంటాడు. పార్వతమ్మ వంట చేసుకొంటో వుంటుంది. ఎన్నడూ లేనిది అదేదో కొత్తగా ఇంట్లో సడీ చప్పుడూ లేకుండావుంటే శివయ్య ఒసేవ మనవాడేడీ అంటాడు. ఆవిడ ఖంగారుగా వంటిటోనుంచి ఇవతలికొస్తుంది. ఆపళంగా ఇల్లంతా తెగవెతకి, ఆయన నాలుగిళ్లూ యీవిడ యిటు నాలుగిళ్లూ చక్కబెట్టి, అడిగినవాళ్లనే అడుగుతూ, ఎంతకీ కనబడక, ఒగురుస్తూ, ఇద్దరూ మళ్లీ ఇంటో కొస్తుంటే, లోపల ఎక్కణ్ణించో తాపీగా బైటికి నడిచి వస్తూ, చొక్కాకి మసిబొగ్గు మరకలూ, చేతులో ముగ్గుబుట్టా, జేబునిండా కంకర రాళ్లూ, చిల్లపెంకులూ వాడూ తయారై పకాలుమని నవ్వుతాడు రంగడు. పార్వతమ్మ పిల్లణ్ణి గుచ్చి కావిలించుకుని కన్నీళ్లు పెట్టుకుంటుంది.

"నీ మొహంలా వుంది వాడిందాకటినించీ వంటింటోనే అహోరిస్తున్నాడు" అని ఉరుముతాడు శివయ్య.

"చాల్లెద్దురూ, మీకు పరధ్యాన మెక్కువ మరీను. మీ టేబిలుకిందనించి వస్తేనువాడు. అక్కడ ఏమి కెలుకుతున్నాడో ఏమో" అని సర్దుకుంటుంది పార్వతమ్మ.

చుట్టుపక్కల అమ్మలక్కలందరికీ ఇదే విడ్డూరం పది రోజులుదాకా.

భైరవమూర్తి అంతకుక్రితం రెండు మూడురోజులకొకసారి వచ్చి చూచిపోతూ వుండేవాడు. ఇప్పుడా అలవాటు క్రమేపీ తగ్గించుకున్నాడు. ఆమధ్య అక్కడా ఇక్కడా వాళ్లముందరా వీళ్లముందరా తనమీద కారాలూ మిరియాలూ నూరుతున్నాడని శాస్త్రి వింటో వచ్చాడు.

రంగడికి అయిదోఏట బళ్లోవేశారు. ఓ నెల్లాళ్లదాకా బళ్లో వాడి పలకో వీడిపలకో పగలగొట్టడం తన పలకమాత్రం భద్రంగా కాపాడుకొంటూ వేళకి మాత్రం సిరావేళ్లతో ఇంటికి రావడం జరిగింది. పొద్దు పొడవగానే లేచి, వేన్నీళ్లు పోసుకొని, తలకాయ దువ్వుకొని, సిలాయి బొట్టు పెట్టుకుని, చేతిలో బలపమూ, చంకలో పలక వుంచుకుని, జారిపోతున్న చడ్డీపైకి ఎగ

లాక్కుంటూ ఇసుకలో నడిచిపోతుంటే, శివయ్యా, పార్వతమ్మ గేటుదగ్గర నిల్చుని అంతూపొంతూ లేకుండా అలాగే చూస్తూ నిలబడిపోతారు.

స్కూలుకి పంపకపోతే, ఆటలుమరిగి చెడిపోతాడేమో. అసలే దుందగుడాయెను అని, భయపడుతుంది పార్వతమ్మ. పంపితే పంచ ప్రాణాలూ అక్కడ్నేవుండె. బొత్తిగా కాలు నిలవదు. స్కూలువెనుక ఒరలులేని నుయ్యిగాని వున్నదేమో; దాని అంచున ఏ బొగడపువ్వు లేరుకుందామని వీడు తచ్చాడుతున్నాడో. తిరిగి వచ్చేటప్పుడు రాచర్లవారి పోట్లగేదె ఎదురవుతుందేమో వాడికి. ఇవీ ఆలోచనలు. సాయంత్రం రెండోవంట తెములుచ్చుకుని, గుమ్మందగ్గర కూచుని, కళ్లు కాయలు కాచేటట్టు ఎదురుతెన్నులు చూస్తుంది. ఆవరణకి ఎగువనీ, గేటు కటూ ఇటూ నిటారుగా ఎదిగిన నేపాళపు మొక్కలు రాత్రికని పక్కలు వేసుకుంటున్నట్టు, పొడుగాటి చక్కని నీడలు తెరుచుకునే వేళకి, గేటు తలుపు తీసుకుని, "అమ్మా వొచ్చా" అంటూ రంగడు.

ఉన్నట్టుండి, పిట్ట పిడుగులా వొచ్చిపడింది, వార్త; పంచమినాడు మంచిదట. ఆవేళ తను స్వయంగా వచ్చి రంగణ్ణి తీసికెళ్లిపోతున్నానని భైరవమూర్తి దగ్గరనించి కబురొచ్చింది. పార్వతమ్మ ఆ మాటతో కొయ్యబారిపోయింది; శాస్త్రికి నోట మాటరాలేదు. అతననుకోలేదు, అన్నగారు హరిజనసేవకీ, రంగడికీ ముడిపెట్టబోతున్నాడని. ఆయన ఇన్నాళ్లూ గుప్తంగా వుంచుకున్న ఆయుధం తళుక్కుమన్నది శాస్త్రికి.

శివయ్యశాస్త్రి రంగణ్ణి దత్తత చేసుకోలేదు. దానితో అభ్యంతర మొచ్చిపడింది. అతను మొదట్లో తనభార్య చెల్లికొడుకు నొకణ్ణి జారదీసి దత్తత చేసుకున్నాడు. దత్తత చేసుకున్న మూడో నెలలోనే ఆ కుర్రవాడు కాస్తా కాలఖర్మవశాత్తూ గటుక్కుమన్నాడు. దానితో హడలిపోయి, "దత్తత చేసుకుంటేమటుకు నేను పెంపిచ్చేది లే"దంటూ పట్టుబట్టాడు భైరవమూర్తి. శివయ్యశాస్త్రి "సరే"నని చక్కా ఊరుకున్నాడు.

ఆ చుట్టుపక్కల కడజాతివాళ్లందరికీ శివయ్యశాస్త్రి అంటే ప్రాణం. తను స్వయంగా నడుముకట్టడమే కాకుండా, ఉత్సాహవంతుల్ని నలుగురినీ పోగుచేసి రేయింబగళ్లు చందాలు వసూలుచేసి, చుట్టుపక్కల మాల పల్లెలకన్నింటికీ శుభ్రమైన రోడ్లువేయించి, మంచినీళ్లు కాథరువు కల్పించి, స్కూళ్లు పెట్టించి, తను చదువుచెప్పి, ఒకళ్లచేత చెప్పించి, తనకు పలుకుబడివున్న వర్తకులచేత పెట్టుబడి పెట్టించి, చేతిపనులు కల్పించి, కూలీనాలీ విషయంలో అన్యాయం జరుగుతుంటే రైతులతో ఘర్షణపడి, పదేళ్లనుంచీ అపారమైన సేవచేసాడు. రాజకీయాలతో ఎంత మాత్రమూ ప్రసక్తి పెట్టుకోకుండా, నిరాడంబరంగా అతను జీవితం గడుపుతున్నాడు. ఆ సేవలోనే అతనికి మనశ్శాంతి, ఆత్మవిశ్వాసమూ, ఔన్నత్యమూ కనిపించాయి. రక్తంలో పాతుకుపోయిన ఈ పునాదుల్ని ఇప్పుడు కదిలించగలడా?

లేకపోతే రంగణ్ణి వొదులుకోవాలి తప్పదు. ఆరునెలల పసిగుడ్డుని తీసికొచ్చి ఎనిమిదేళ్ళుపెంచిన మమకారం ఇప్పుడు కసి తీర్చుకొంటోంది. ఈ వుద్యమంలో ప్రవేశించేముందు, తను వొదులుకున్న స్వార్థాలూ, ఐహికబంధాలూ అన్నీ రంగడిలో గుమికూడి అతన్ని రెక్కలు పట్టుకుని కిందకి అణిచిపెట్టాయి. రంగడు తన జీవితంలో అణువణువునా ఆక్రమించుకున్నాడని

అతని కింతవరకూ తెలియనే తెలియదు.

తను చదువుకుంటూవుంటే అల్లరిచేస్తాడు; రాసుకొంటూవుంటే కాయితాలు లాగుతాడు; గడప దాటితేచాలు కూడాబడతాడు; ఇంట్లో అడుగుపెట్టటం తరువాయి, రివ్వున చంకకి దూకుతాడు. అతను చేసే ప్రతిపనికీ, ప్రతి ఆలోచనకీ, రంగడి ఉనికి, వాడి అలికిడి, స్పర్శ, నీటిమరుగున కలవతూడులాగ, ముత్యాలకోవలో సిల్కుదారంలాగ, కనపడకుండానే, తప్పనిసరిగా ఉండాలిసిన అవసరమొకటి బలీయంగా కనిపిస్తున్నది. మాటిమాటికీ, రంగణ్ణి వొదలడమెట్లా? ఈ తపనలో అతని హృదయం గిలగిల కొట్టుకుంది.

మమకారానికి అంతూపొంతూ ఒకటుందా? భార్యమీదనుంచి బిడ్డమీదకి జారుతుంది. అక్కడ దులిపేసుకోగలిగితే ఊరిమీద పడవచ్చు - అక్కడా వొదిలించుకుంటే, దేశమ్మీదా వాలవచ్చు - ఆ బంధమూ తెంచుకుంటే విశ్వమానవ ప్రేమక్రింద ఏ మానవునికి ఇబ్బంది కలిగినా బాధపడనూవచ్చు - ఇంకో మెట్టు పైకి ఎగబ్రాకి, భూతదయకింద మారి, చీమనలిగితే చాలు కన్నీళ్లు తోడనూవచ్చు, ఎటొచ్చీ ఈ బంధానికి, ఆవరణ పెద్దదవడమేగాని, అందులోవున్న బాధా, మనోవేదనా ఏ శ్రేణిలోనైనా తప్పవేమో.

పార్వతమ్మకి ఈ ఆలోచనా పాలోచనా పట్టదు. ఆమెకొక్కటే గురి. భర్త ఒక దైవము, దయాసముద్రుడు. దీనత్వానికి కరిగినీరై జాలువారే గుండెపొరలలో పెల్లలుగావూడి, నాకులం, నామతం, నాదేశం అన్నవి నుగ్గయిపోయినా, లెఖ్ఖచెయ్యని ధీరుడు. ఈ హరిజనులతో సంబంధం వొదులుకోగూడదా అని భర్తకి చెప్పేధైర్యం లేదు. ఏదో వొకటి నిర్ణయించుకోవాలన్న సంగతీ మరచిపోయింది. అగాధంలో మునిగి ఉక్కిరి బిక్కిరవుతున్నది.

ఆవేళ రంగడికి చిక్కని ఆవుపెరుగుపోసి, బువ్వతినిపించి పడుకోబెట్టింది. భోజనాలుచేస్తూ ఇద్దరూ మాట్లాడుకోలేదు. ఓవైపున మంచంపట్టిమీద కూచుని రంగణ్ణి చిచ్చికొడుతోంది పార్వతమ్మ. మరోవైపున శాస్త్రి కూచున్నాడు. వేళ్లాడగట్టిన పాలకుండ ఉట్టిమీదనించీ ఒలికి పోయినట్టు కిటికీ రెక్కలలోనించి ఆకాశపు నీలాల కాంతుల్ని చీల్చుకుని వెల్లువకింద వొచ్చే వెన్నెల పరుపునంతటినీ తడిపేస్తోంది. కిటికీఊచల సన్నపాటి నీడలు మాత్రం రంగడి మెడవొంపుల మీదా, అరికాళ్ల గులాబీల మీదా వంకరటింకరులుగా పడి, చరచరా పాకిపోతున్న నల్లతాచు మెలికల్లా అవుపిస్తున్నాయి. రంగడు మాత్రం గాఢనిద్రలోవుండి రాహువు సగం మింగెయ్యగా మిగిలిన చంద్రవంకలా, ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. ఆ లేతహృదయానికి, తనచుట్టూమూగిన ఆ అలజడి, ఆ గుండెకొట్టాటా. ఆ తీరని తపనా లవలేశమూ అంటవు.

"మాట్లాడరేమండీ?"

"ఏమీ పాలుపోవటం లేదు."

"ఎట్లా తీసుకు వెడతారూ? ఆయన ఇష్టమేనా ఏమిటి?"

పేలవంగా నవ్వాడు శివయ్య. పార్వతమ్మ వట్టి అమాయకురాలు. తను దత్తత చేసుకోలేదు.

రంగడు తన కొడుకు కాదు... ఇన్నాళ్లకి, ఇప్పుడే ఆ కఠోరమైన సత్యం అగ్నిగోళంగా పగిలి నగ్నంగా ఆ యిరువురి కళ్లలోనూ జిగ్గుమన్నది భయంకరంగా... రంగణ్ణి అన్నగారు తీసుకెళతాడు. ఎట్లాగూ తప్పదు. తీసుకువెళ్లే హక్కు ఆయనకున్నది. ఉన్నదని ఆయనకు తెలుసు. తనే అజ్ఞానంలో వున్నాడు.

విడమర్చి చెప్పాడు పార్వతమ్మకు. అర్థమయింది. తన చేతులలో తన మమకారపు నీడలో తన గుండె పొత్తిళ్లలో మసిలిన పసివాడు తనవాడు కాదు.

"బ్రతిమలాడండి - ఏమిచేస్తాం మరి"

"వినడు"

"ఏమో మనస్సు కరగకూడదా?"

మళ్లీ నిశ్శబ్దం - గుండెల్ని సన్నగా చీల్చి కరకరనమిలి నెత్తురులు పిండే నిశ్శబ్దం.

"లేకపోతే ఎనిమిదేళ్లు మనచేతులారా పెంచుకున్న పసిబిడ్డని ఎలా వొదులుకోగలం?"

భళ్లున తెల్లవారింది.

పంచమి ఘడియలు రాగానే గుమ్మంలో జట్కా ఆగింది. యమకింకరుడల్లే భైరవమూర్తి దిగాడు. వచ్చి కూచుని క్షణం కాలేదు. "రంగా" అని పిలిచాడు. రంగడు ఖుషీగా దగ్గరికి వచ్చి చేరాడు పిప్పరమెంట్లకని.

"అన్నయ్యా ఇది న్యాయమేనా? నా మీద కసి తీర్చు కోవాలంటే..." శివయ్య.

"మమ్మల్ని కనికరించండి. ఈ కడుపుకోత భరించలేము" పార్వతి.

తమ్ముడూ ముక్తసరిగా చెబుతాను విను. నీ మనస్సుకి కష్టం కలుగుతుందని నాకు తెలుసు. చాదస్తమను, సనాతనత్వమను, చట్టుబందలను. సామతం నాది. ఈ విషయమై నేను తీవ్రంగా ఆలోచించానుస్మీ. నిన్ను నా చెప్పు చేతలలో వుంచుకోవాలని నాకు సుతరామూ లేదు. నువ్వు స్వతంత్రుడివి. నీ ఇహ పరాలు నువ్వు చూచుకో, నీ కార్యకలాపాలలో, నీ జీవితంలో నేనందుకోలేని ఉదాత్తత, అన్వయించుకోలేని పావిత్ర్యమూ, నా శ్రోత్రియపు పంథాలో ఇంత వెలుగు రాల్చలేని ఆధ్యాత్మిక తేజస్సు ఏదో లీలగా నాకు అవుపించకనూ పోలేదు. కాని నా బిడ్డని. నా రక్తంలో రక్తాన్ని, కళ్లారా చూస్తూ చేతులారా ఈ అనార్య గృహంలో దిగవిడిచి పొమ్మంటేమటుకు నాకు మనసొప్పడం లేదు. చెప్పొద్దూ; ఎంచాతనో, నేను మనఃపూర్వకంగా నా బిడ్డని కులభ్రష్టుణ్ణిచేసి వొదిలిపెట్టి మన పితృదేవతలందరికీ ద్రోహం చేస్తున్నానేమో అని గుండె పీకుతున్నది; రాత్రిళ్లు మనస్సు క్షోభించి పోతోందంటే నమ్ము; ఈ పాదిత్యం నా మెడకు చుట్టుకోలేను. కాని నిన్ను ఉసురుపెట్టలేక కాలయాపన చెయ్యాలిసొచ్చిందిన్నాళ్లూ. నమ్మూ నమ్మకపో.

చివ్వునలేచి జట్కా ఎక్కాడు రంగడితో.

శివయ్య ఏమో మాట్లాడబోయాడు. పార్వతమ్మ నాయనా రంగా అని మాత్రమే అనగలిగింది.

రంగడు సరదాగా వున్నాడు. సముద్రపు వొడ్డుకో, పార్కులోకో అనుకుని, గబగబా జట్కా ఎక్కి చురుగ్గా లోపలికి జరిగి, కిక్కురుమనకుండా కూచుని మరి వెనక్కి చూడలేదు. క్షణంలో జట్కాబండి రోడ్డు మలుపులో మాయమయింది. జట్కా కదిలింతరువాత అమ్మా, నాన్నా రాలేదేమో అని ఆలోచనలో పడ్డాడు రంగడు. బండిలో చూడబోతే యీయన ఉగ్రంగా వున్నాడు. బిక్కమొహం వేసి ముడుచుకుని కూచున్నాడు.

శాస్త్రి అక్కడా అక్కడా తిరిగి సాయంకాలానికి ఇంటికి తిరిగి వచ్చాడు. పార్వతమ్మ ఆ వంటింట్లో ఏదో వొక కొండగుహలో వున్నట్టు కూర్చుంది. ఇల్లంతా ఖాళీగా వున్నట్టనిపించింది. ఒక్క ఇల్లేకాదు - ఇంటోవున్న మనుషులు - మనుషులే కాదు వాళ్ల హృదయాలు, హృదయాలే కాదు లోపల ఆలోచనలూ ఒక్కసారిగా పరువుకొచ్చిన పళ్లతోటలో పక్షులు కోలాహలమంతా ఒక్కసారి సద్దుమణిగినట్టు, రంగడు లేకపోగానే వాళ్ల ఇరువురి జీవితాలూ నిర్జీవంగా, నిస్సారంగా మారి కళా కాంతీ లేకుండా నిలిచిపోయాయి.

పార్వతమ్మ ఏడుస్తూ కూచుంటున్నది. బెంగటిల్లి పోతుందని శాస్త్రి ఇంటిపట్టున వుండాలనుకున్నాడు. బైటికి వెడితే "రంగయ్యగా రేరండీ" అని చురుక్కుమని ప్రశ్నలు - ఇసకలో పిల్లల కేరింతలూ - పార్కుదగ్గర కోలాహలం - భరించలేడు. ఇంటిలో కూచుందామా అంటే తీరని వెలితి! ఎక్కడవస్తువక్కడే, ఎలాగున్నదలా పడి వుంటున్నది. ముగ్గులుచెరగవు; గుమ్మాలదగ్గర నీళ్లమడుగులు మాయమయ్యాయి; పురుగు తప్పేలాలో మట్టి పెళ్లలు లేవుగదా అని చూడనక్కర లేదు. రంగడు సగం చింపిన పుస్తకాల అట్టలూ, బళ్లో బద్దలు కొట్టుకొచ్చిన పలక పగులూ, గచ్చుమీద బొమ్మలు రాయబోతే చిట్లిన కలంపాళీ, కుండీలో తెంపి పోగులు పెట్టిన నాదాంబరం చెట్టు మొండిచిగుళ్లూ అన్నీ పనిగట్టుకు అక్కడలేని రంగణ్ణి వేలుపెట్టి చూపిస్తున్నాయి. మనం జీవితంలో పొందుతున్నా మనుకుంటున్న మహదానంధం ఎట్లాంటి చిన్న చిన్న ఆధారాలు పట్టుకుని కొనలు సాగుతుందో ఆశ్చర్యం; అతని మనస్సు వికల మయిపోయింది.

ఆనాడు రంగడు పుట్టినరోజు పండుగ.

శివయ్యశాస్త్రి ఓ డజను యాపిలుపళ్లూ, ఒక వెండి పాయసంగిన్నె, కుట్టించిన ఖద్దరుసిల్కు షరాయీ, చొక్కా పట్టుకుని అన్నగారింటికి బయలుదేరాడు. పార్వతమ్మ "నేనూ రానా?" అంది. అయిదు రోజులయింది వాణ్నిచూచి. వెళ్లి కబురు పంపుతాలే అన్నాడు. మేడమెట్లు గబగబా ఎక్కుతుంటే పనిమనిషి ఎదురొచ్చి. "రావొద్దని చెప్పమన్నారండి అయ్యోరు" అంది. నిర్ఘాంత పోయాడు.

"రంగడ్నిచూచి వెళ్లిపోతా"

ఎవరిముందు ప్రాధేయపడుతున్నాడో అతని కర్థంకాలేదు.

"ఈల్లేదంటన్నారండిబాబూ, ఎల్లిపొండి"

అడ్డంనుంచుంది పైగా.

అతనికి చివుక్కుమన్నది. గంగిగోవులా చూస్తాడు ఏమిలాభం.

"పోనీ ఇవన్నీ రంగడికివ్వు వెళ్లిపోతా"

"అమ్మయ్యో కొంప మునుగుతాదిబాబూ"

అతనికి కళ్లనీళ్ల పర్యంతమయింది. కాని దానిముందా యాడవడం? చిన్న మొహంతో వెనక్కి తిరిగాడు. తలుపు గట్టిగా వేసుకుని చక్కాబోయింది, పనిమనిషి, అది ఆ యింటి తలుపుకాదు. తనకీ తన రంగడికీ మధ్య అన్న భైరవమూర్తి బిగించిన కొత్త ఉక్కుతలుపు"

శాస్త్రి యధాప్రకారం హరిజన హాస్టలికి వెళ్లి వస్తున్నాడు. ఎలాగా ఏదోవొక ఆదర్శానికి మొగాడు సులభంగా కట్టుబడతాడు. ఎంత గాయమయినా పట్టీలు వేసుకుని పనిలో దిగుతాడు. కానీ, స్త్రీ మమకారాలకి ఇట్టే లొంగుతుంది.

"నా మాటలు వినండి; వెళ్లి రంగణ్ణి తీసుకురండి" గుమ్మందగ్గర నిలబడింది గద్గదంగా.

"అంత సులభమా? ఇన్నాళ్లు పెంచామే? ఇంత మమకారం పెంచుకున్నామే? వాడైనా పసివాడుకదా! బెంగతో కుళ్లుతున్నాడో ఏమీ పట్టదాయనకి... బైటికి రానివ్వడమే లేదు వాడిని. పెద్ద ఇనపతెర యేదో కట్టేస్తున్నాడు వాడి చుట్టూ. వాడి మొహమైనా చూడనివ్వని రాక్షసత్వం ఎట్లా కరిగించగలను?"

"ఆయన చెప్పినట్టు వినండి – మారు చెప్పకండి"

"అంటే"

"ఆయన వొద్దన్నపని మానడమే."

అదేమిటి? వంద తర్కాలూ, వెయ్యి వేదాంతాలూ చెయ్యని పని క్షణంలో పార్వతమ్మ నోటమ్మట వొచ్చిన ఆ ఒక్కమాట పనిచేసింది అతనిలో. ఆలోచనలో పడ్డాడు.

"ఆలోచించకండి. మనం వుండలేము. మీరెంత కృశించి పోతున్నారో మీకు తెలియదు. రంగణ్ణి – మన రంగణ్ణి తీసుకురండి" ఆమెకి కన్నీళ్లు జలజలా రాలాయి.

"పోనీ వాడికి పెద్దచదువులు చదివిద్దాములెండి. వాడి అభిరుచుల్ని మీకిష్టమైన దారికి మలవండి. పాదుని పందిరిమీద కెక్కించమూ – ఎండపడే వేపుకి తీగలు తిప్పమూ – అట్లా – మన రంగడు మంచి తెలివైనవాడు. ఎంత ఉదారగుణం వాడిది; మీకు తెలియదా? వాడు తప్పకుండా గొప్పవాడవుతాడు. ఇప్పుడు మనల్ని బెదిరించి మీ అన్నగారు మానిపించిన కార్యకలాపాలు అప్పుడు వాడిచేత చేయిద్దాము. ఏమంటారు? అప్పుడు మీ అన్నగారి ఆట కడుతుంది."

పార్వతమ్మకి ఇంతటి ఊహాపోహలున్నాయని శివయ్య కింతవరకూ తెలియదు. గాఢమైన

వాత్సల్యపు లోతులలో కొట్టుమిట్టాడగా పట్టుదొరికిన ఉపాయమిది.

పైన కండువా వేసుకుని శివయ్య బయలుదేరాడు అన్నగారింటికి. పంచములతో ఇక ఎలాంటి ప్రమేయమూ పెట్టుకోనని మాటయిచ్చి రంగణ్ణి తెచ్చుకోవాలి గావును - కష్టమనిపించింది - కాని తప్పదు - తను చెయ్యదలుచుకున్న సేవ, పరోక్షంగా చెయ్యగల సావకాశాలు వుండనే వున్నై. అన్నగారు "చాతనయితే జైలుకు వెళ్లు చూదామని" తనని కించపరచడానికే అయినా, ఇప్పుడు తనకి పనికివచ్చే సూచనలందించనూ అందించాడు.

*　　　*　　　*

రాత్రి అయింది. శాస్త్రి ఇంకా రాలేదు. పార్వతమ్మకి భయం పుట్టింది. నిద్రపట్టలేదు. ప్రొద్దున్నేలేచి హరిజన పాఠశాలలో మేష్టారు లింగరాజుగారింటికి వెళ్లి అడిగింది. శాస్త్రి అరెస్టయ్యాడని తెలిసింది. లింగరాజూ అదే ఖంగారులో వున్నాడు. పోలీసుస్టేషనుకి వెళ్లివచ్చి పార్వతమ్మకి తబిశీలుగా చెప్పాడు.

"బాంబు కేసులో పట్టుకున్నారని పుకారుగా వుంది."

పార్వతమ్మకి అర్థంకాలేదు.

"ఎవరో కొందరు ఆకతాయిలు ఇక్కడ కలెక్టరునీ, కొందరు తెల్లవాళ్లనీ పేల్చేదామని బాంబులు చేస్తున్నారట. ఉప్పుటేరు గట్టున - ఇది వట్టి రాక్షసచర్య - వద్దు. అని హితబోధ చేసేందుకు అక్కడికి వెళ్లానంటాడు శివయ్య - 'ఆయనకీ ఇందులో ఒక చెయ్యి వున్నది - అంచేత అందరితోపాటు ఆయననీ ఎరెస్టు చేశాము' అంటారు పోలీసులు."

"అయ్యయ్యో ఆయనసలు రాచకీయాల జోలికి-" తల బాదుకున్నది.

"ఎవరు నమ్ముతారు? ఎందుకెళ్లాడక్కడికి... చివరికిట్లా పరిణమించింది."

పార్వతమ్మ దిగాలుపడిపోయింది. బావగారు ఇంకా కసితీర్చుకుందామని పన్ను తున్నాడేమో - ఊరంతా మాడిపోతున్నది - శివయ్యశాస్త్రి బాంబు కేసులో చిక్కుకున్నాడని.

పార్వతమ్మా కోర్టుకి వెళ్లక తప్పలేదు.

ఆవేళ తీర్పు. కోర్టులో జనం బిలబిరలాడుతున్నారు. పార్వతమ్మకి గుండె వేగంగా కొట్టుకుంటున్నది. శాస్త్రికి ద్వీపాంతరవాసంలో 16 సంవత్సరాలు కారాగారావాసం విధించారు.

ఎవళ్ల తోవని వాళ్లు వెళ్లిపోయారు.

భైరవమూర్తి జాడలేదు.

రాజమండ్రి సెంట్రల్ జెయిలులో కొన్నాళ్లుంచి, మద్రాసు రేవులో ఓడ యెక్కించారు శివయ్యని.

ఓడ విస్సురుగా పోతున్నది. శివయ్యకి కళ్లు గిర్రున తిరుగుతున్నాయి. నక్షత్రాల సన్నని

వెలుగులో, సముద్రపు కెరటాలు బుస్సుమనిలేస్తూ, కూసం విడిచిన నల్లతాచుపాములు మెలికలు తిరిగిపోతున్నట్టు భయంకరంగా మిలమిల లాడుతున్నాయి. ఓడ గొట్టంలోంచి నల్లనిపొగ భుగభుగమంటూ ఓడను చుట్టేసి ఆకాశానికి తారురంగు పూస్తోంది.

* * *

కాలమానం మహాకఠోరమయింది. ఒక్క క్షణమాగదు. ఒక్క కన్నీటిబొట్టు రాల్చదు. మెయిలుబండిలా రివ్వున పరిగెత్తింది. మధ్యమధ్య ఆగవలసిన స్టేషన్లూ లేవు. అర్థంకాని పేజీలు గబగబా తిరగేసినట్టు శివయ్య కళ్లుమూసి కాలాన్ని నెట్టేస్తున్నాడు. నెలలూ సంవత్సరాలూ అతనిమీదనించీ దొర్లిపోయాయి.

* * *

పదహారు సంవత్సరాలూ గిర్రున తిరిగివచ్చాయి. శివయ్యని విడుదల చేసి కోస్తాలో దిగవిడిచారు జైలు అధికారులు.

ఎప్పుడో రావలసిన ముసలితనం పదేళ్లు ఎదురొచ్చి తారసిల్లి చిన్నచిన్న గుడారాలు వేసుకుని విడిసినట్టు, అతని ఒడలంతా ముడతలుపడింది; తల నెరిసింది; ముఖమంతా పాలిపోయింది; జవసత్వాలుడిగినై. గర్భగుడిలో చమురుదీపంలాగ, ప్రాణాలు ఎక్కడో లోతుగా మినుకు మినుకుమంటున్నాయి; చలవరాతిగోడలా వున్నాడు.

రైలుదిగి తిన్నగా ఇంటికి వెళ్లాడు. జనస్మృతిలో అతని హరిజన సేవ అట్టడుగున పడిపోయింది. విడుదలయిన ఈ బాంబుకేసు ఖయిదీని ఎవ్వరూ ఆనవాలుపట్టలేదు. స్వరాజ్య మింకా రాలేదు గావును అనుకున్నాడు. గోడలనిండా బొగ్గుసిరాతో 'మానాయకు లెక్కడ' 'ఈ రాక్షస పరిపాలన ఇంకెన్నాళ్లు' అని నినాదాలు.

ఇల్లు శుభ్రంగా లేదు. పాడుపడినట్టుంది. లోపల జీర్ణించిపోయిన జ్ఞాపకాలన్నీ, మళ్లీ కొత్తప్రాణం పోసుకుని ఆ పరిసరాలని గుర్తుకు తెచ్చుకుంటున్నాయి. వీధి కెదురుగా ఊడలమర్రి కింద రంగడు రోజూ దణ్ణంపెట్టి వచ్చే, రామాలయం మండపం గచ్చురుగుమీద పొరుగువాళ్లతో పార్వతి ఆడుకునే పచ్చీసుగుళ్లు –

"పార్వతీ?"

అతని గుండె ఆగింది. చూస్తే ఆనవాలు పట్టగలదా?

పైన తాళంవేసి వుంది!

పొరుగింటికెళ్లి కనుక్కున్నాడు. అనుకున్నంతా అయింది. పార్వతమ్మ కాలంచేసి పదేళ్లయిందట. రాలడానికి ఒక్క కన్నీటిబొట్టయినా లేదు శివయ్యకి.

రంగారావు ఇక్కణ్ణే పోలీసు సబిన్స్పెక్టరుగా పనిచేస్తున్నాడు.

"మా రంగడే?"

అతనికి ప్రాణం లేచివచ్చింది.

లేని సత్తువ తెచ్చుకొని విసవిసనడిచి వెడుతున్నాడు పోలీసు స్టేషనుకి.

రంగారావు బంగాళా క్రాపూ, పోలోకాలరు చొక్కా, పైన నీటైన స్వెట్టరూ – వాలుకుర్చీలో పేపరు చదువుకుంటున్నాడు. పోలీసుస్టేషనులో అడుగుపెట్టగానే శివయ్యకు మతిపోయింది. రంగడలావున్నాడేమిటి? చిన్నప్పుడు తన తొడమీద కూచుని కథలు ఊకొట్టిన రంగడేనా?

రంగారావు నిర్లక్ష్యంగా చూసాడు. వొచ్చిందెవరో గమనించలేదు.

'నాయనా రంగా?' కంఠంలోకి వొణుకు ప్రవేశించింది. రంగారావు పేపరు కొంచెమడ్డు తీసి చిరాకుగా చూస్తున్నాడు.

"ఏమిటిది? ఎవరుమీరు?"

శివయ్య తమాయించుకుని తాపీగా ఫలానా అని చెప్పాడు. రంగారావు పేపరు టేబిలుమీద వుంచేశాడు.

"నన్ను పెంచారా మీరు?"

"అవును చిన్నప్పుడు"

"పినతండ్రి అంటే"

"మీనాయనా నేనూ అన్నదమ్ములం"

"సయానా"

"అవును సయానా"

తండ్రికొక తమ్ముడంటూ వున్నాడని తనకెవరూ చెప్పలేదు. శివయ్యని ఎగాదిగా చూసాడు. పెరిగినగడ్డమూ, మాసినబట్టలూ, సంస్కారంలేని జుట్టూ... పోలీసు డిపార్టుమెంటు తాలూకు అనుమానపు వంకర చూపొకటి ఓరకంట విసిరి "సరే కూచోండి" అని మళ్లీ పేపరు తీశాడు. పేపరు చదువుకుంటున్నాడో, ఈ బైరాగివాడి ఎత్తు ఏమిటా అన్న దిలాసాలో లోపల కత్తులు నూరుతున్నాడో, ఆ నూరుతున్న సాన తనకి కనిపించకుండా పేపరు అడ్డమే పెట్టుకున్నాడో, శివయ్యకి గ్రాహ్యం కాలేదు.

శివయ్య తనే ఆ చివ్వర బెంచీమీద కూచున్నాడు. ఆతృత తగ్గింది. అణిగిన పాలపొంగులా చదికిలబడ్డాడు. వెళ్లేపోయే జనాన్ని చూస్తూ కూచున్నాడు.

అంతలో ముగ్గురుజవాన్లు ఒక ఖద్దరువాలీని పట్టుకొచ్చారు. సబిన్స్పెక్టరు రంగారావు పేపరు దించలేదు. ఈ పట్టుకురావడం అంత మామూలేమో. హాలుచివర చిరిచాపమీద కూచో బెట్టారాయన్ని. వంకీలమీదవున్న తోలుపటకా లందుకున్నారిద్దరూ.

ఇదిగో అప్పారావుగారూ – మీరు పెద్దలు – మిమ్మల్ని హింస పెట్టాలని మాకు లేదు.

మీ కొచ్చిన ఫరవాలేదు. అది గుర్తు పెట్టుకోండి.

"కలెక్టరుగారి అత్యాచారాలు వర్ణించి వ్రాసిన ఆ మేధావి ఎవరు?ఆ సైక్‌లోస్టయిలు పత్రిక 'కత్తులబోను' సంపాదకుడెవరు? ఈ వివరాలివ్వండి. అంతే మీ దోవన మీరు చక్కాబొండి."

"సబిన్స్పెక్టరుగారు మంచివారు. ఈ ఆవకాశాన్ని మాత్రం జార విడుచుకోకండి. తరవాత మీ యిష్టం."

అప్పారావుగారు వులకడు పలకడు.

"మాకు కావలసింది మీరు కాదు. మీకు తెలిసిన సమాచారం అంతే. ఆ సంపాదకుడూ వాళ్లూ ఎక్కడున్నారో ఆ తబిసీళ్లు మా కఖ్ఖరలేదు స్మండీ. ఆ కూపీలు మాకు వొదిలేయండి. అసలు వాళ్లు ఎవరు? పేర్లు చెప్పండి అంతే"

"డబుల్ సెవెన్" అని అరిచాడు సబిన్స్పెక్టరు రంగారావు. "సార్" అని ఎలర్టయ్యాడు జవాను.

మొహం చిట్లించి పేపరు వొంచి "ఏమిటా ధోరణి?" అని ముదలకిస్తూ చూసాడు - అప్పారావుగారి వంక కాదు జవాను వంక.

డ్రాయర్లో రివాల్వరుతీసి పంట్లాము జేబులో పెట్టుకుంటూ సాదరంగా చూసాడు అప్పారావుగారి వంక.

ఇక తనే రంగంలోకి దిగాడు.

"చూడండి అప్పారావుగారూ నా డ్యూటీ నేను చెయ్యాలి. వాళ్లెవ్వరో మీకు తెలుసు - అని నాకు తెలుసు. 'నాకు తెలియదు' అని మొరాయిస్తే 'తెలుసుగాని చెప్పను' అని అర్థం. చెబుతారా! చెప్పరా? ఒక్కటే ముక్క"

"నాకు తెలియదు" అని నిష్కర్షగా అనేసాదు అప్పారావుగారు.

శివయ్య గుండె వేగంగా కొట్టుకున్నది.

'డబుల్ సెవెన్' అని అర్థవంతంగా ఒక్క అరుపు అరిచాడు సబిన్స్పెక్టరు రంగారావు. అంతే; పులి తనపంజాతో కొట్టి జింకపిల్లని పొదలోకి చరచరా ఈడ్చుకుపోయినట్టు, జవాన్లు నలుగురూ ఆ మానవుడ్ని దబాయించి పట్టుకొని బరబరా లాక్కుపోయారు లోపల గదిలోకి.

ఇహ లోపలనుంచీ చెళ్లుచెళ్లుమని వొస్తున్న హంటరు పటకా వాయిద్యానికి, పెంకులెగిరేలా పేలిపోతున్న పొలికేకలకీ హడలిపొయ్యాడు శివయ్య.

రంగారావులో అసలు చలనం లేదు. తల ఓరగా వంచాడు. చిన్న నవ్వు నవ్వాడు. విల్స్ సిగరెట్టు వెలిగించాడు. వొదిలిన పొగ రింగుల్లోకి అలవోకగా చూస్తూ "కాఫీ తాగారా?" అని పరామర్శించాడు. "అన్నట్టు ఎక్కడ్నుంచీ మీ రాక?" ఏమిటీ మీ వ్యవహార మసలు?

ఏమవుతారు నాకు? ఏదో చెబుతున్నారు గదూ?" మళ్లీమొదటికొచ్చాడు. కేసు ఫైల్లేదో చూసుకుంటున్నాడు గావును. ఏ ప్రశ్నకీ సమాధానం కోరుతున్నట్టు అవుపించదు. ఒక ప్రశ్ననుంచి ఇంకో ప్రశ్నకి గెంతేస్తున్నాడు. ఎవరో పార్టీలు వచ్చారు వెళ్లారు; శివయ్యకి సమాధానం చెప్పేసందే దొరకలేదు. వున్నట్టుండి "ఇహ నేను ఊళ్లోకి వెళ్లిపోవాలి. మీరు విశ్రాంతి తీసుకుంటారు గదూ – సిక్సెవెన్‌టీన్" అని కేకవేశాడు.

పేటెంటు లెదరు బూటు వేసుకుని టకటకలాడుతూ వెళ్లిపోతున్నాడు రంగారావు. కెరటం దిగజారిన వొడ్డులా నిలబడి చూస్తున్నాడు శాస్త్రి.

అంతా వెళ్లిపోయారు. రైటరు తన గదికి తాళంవేసి "పరుండండి సార్" అని మెట్లు దిగాడు. శివయ్య ఒక్కడూ ఉండిపోయాడు. తను ఎక్కడ తిండి తినేదీ కనుక్కోవాలనైనా తోచలేదు రంగడికి. పోనీ ఇంటికి రమ్మననూలేదు. లోపల చాపాలేదు. మంచమూలేదు. విశ్రాంతి తీసుకొమ్మన్నాడు. ఎక్కడ? ఒక మూల కండువా పరచుకుని గడపమీద తలానించి పడుకుని, సావకాశంగా ఆలోచించు కుంటున్నాడు. ఆ తలుపులూ కిటికీలు వేస్తేసరి జైలులో వున్నట్టే వుంటుంది. చీకూ చింతా లేకుండా పనిగట్టుకుని లేచి రెక్కలన్నీ జాగర్తగా మూసి గడియ మాత్రం వెయ్యకుండా ముడుచుకు పడుకున్నాడు.

నాలుగు జంతికలు తెచ్చాడిద్దామని. ఇంకా నయం ఇవ్వలేదు. తను విడుదలయిన బాంబుకేసు ఖయిదీనని చెబుదామని మహా ప్రయత్నించాడు. ఇంకానయం చెప్పలేదు. తనమీద ఈ జవాన్లనందరినీ నిగావేసే వాడు. అప్పారావుగారిని పెట్టిన యాతన స్ఫురణకొచ్చి గుండె ఝల్లుమన్నది.

తన రంగడ్ని జ్ఞాపకానికి తెచ్చుకుంటున్నాడు. ఆ రంగడెక్కడ? విచ్చిన కలవపువ్వులాంటి మొహమూ, చిన్న సువర్ణరేఖ మామిడి పళ్లల్లే బుగ్గలూ, అప్పుడేకొన్న టెన్నిస్ బంతుల్లా మిసమిసలు చిమ్మే చిన్న మడుమలు... తనకీ తన పార్వతికీ బ్రతుకులో అమృతం చూపిన రంగడు ఎక్కడ? ఏడీ వీడా? కత్తిరింపు మీసాలలో వెకిలి కళ్లల్లో రక్తపు జీరా, పెదిమలలో గర్వం, మాటలో పెడసరం – అబ్బే తన రంగడు వేరు – తన రంగడు లేడు. వెతికినా దొరకడు. ఈ రంగడు తన రంగడు కాదు. తన రంగడు చచ్చిపోయాడు. కాలం మడతలలో ఎక్కడో దాచేసింది వాణ్ణి, భళ్లుమని దుఃఖం వచ్చింది.

ఇన్నాళ్లూ తన రక్తనాళాలలో ప్రతి బిందువుని పట్టుకుని వేళ్లాడిన రంగడు – ఎదట కనబడుతున్నా తనకి లేడు.

వాడికసలు జ్ఞాపకమేలేదు. తనెవరో, వాడెవడో, అసలు తన సొదకొసాకూ వినలేదు వాడు. ఎలా వింటాడు? తను ఉన్నట్టే వాడికి తెలియదాయె. ఇన్నాళ్లూ బ్రతుకీడ్చుకొంటూ వస్తా ఇందుకా? అసలు నిజంగా తన రంగడే కనిపిస్తేతను ఆనందం పట్టగలడా? తట్టుకుని ప్రాణాలు పుంజుకుని నిలద్రొక్కుకో గలడా?

"భగవంతుడా – చివరికి మిగిలిన నా రంగడ్నికూడా నాకు కాకుండా చేశావా? ఈ

గుండె పోటుతో నీ పగ చల్లారిందా?" అనుకున్నాడు.

వీధి చివరికి వెడుతున్న కొద్దీ సన్నగిల్లుతున్న మాదాకవళం వాళ్ల అరుపులు; అపుడే స్టేషనని నించీ కదులుతున్న రైలుకూత దగ్గరి; ఆ అలికిడికి లేచి యెగిరిపోతున్న పిట్టలు - తపతపమనే రెక్కల చప్పుడు; అందాకా శ్రమపడి ఇసుకలో కట్టిన గూళ్ళన్నీ తొక్కేసి ఇళ్ళకి పరిగెత్తే ముందు పిల్లకాయల గొల్లుమనే అల్లరి.

సాయంత్రం ఒక మీటింగులో లాఠీచార్జీచేసి, ఒక కాంగ్రెస్ భవనంమీద కసిదీరా దాడిచేసి అక్కడ కుర్చీలూ, బెంచీలూ, కూజాలూ తర్లించుకొని, సబిన్స్పెక్టర్ రంగారావు ఒక సెక్షన్ జవాన్లని వేసుకుని వచ్చాడు. ఖారాకిల్లీ బనాయించి, నేవికట్ సిగరెట్టు కాల్చుకుంటూ తలుపు నెట్టాడు. గలభాగా స్టేషనులోకి జొరబడ్డారంతా. కూనిరాగం తీస్తూ, రంగారావు స్విచ్చి వేశాడు.

"హోరి నీ నిద్ర మాసిబోను లేవవయ్యా - ఏమయ్యోవ్"

పొలికేకలు పెట్టినా ఆ పడుకున్నాయన కదలడు, మెదలడు. రంగారవు రెక్కపట్టుకుని విదిలించాడు, చేతికి మంచుగడ్డలా తగిలింది శరీరం...